
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




కడప

జిల్లా వార్తలు

5

మంగళవారం 4 జూన్ 2024

జాతకాలు తేలేది నేడే



సార్వత్రిక ఎన్నికల సమరంలో ఇక చివరి అంకానికి చేరుకున్నాం. మే 13న జరిగిన పోలింగ్‌లో అభ్యర్థుల జాతకాలపై ఓటర్లు తీర్పు రాశారు. అప్పటి నుంచి ఇన్నాళ్లూ గెలుపు మాదంటే మాదే అంటూ ప్రధాన పార్టీలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చాయి. అయితే ఓటర్లు రాసిన జాతకం నేడు బట్టబయలు కానుంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో, ఎవరిని ఓడిస్తారో, ఎవరికి పట్టాభిషేకం చేస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. టీడీపీ కూటమిదే విజయమని 90 శాతం ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. గెలుపు మాదే, మళ్లీ జగనే సీఎం అంటూ వైసీపీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. ఇదంతా మంగళవారం ఉదయం 8గంటల వరకే. ఎందుకంటే ఎన్నికల కౌంటింగ్ 8గంటలకు ప్రారంభమవుతుంది. అభ్యర్థులకు ఓటర్లు రాసిన అసలు జాతకాలు బయట పడతాయి.



- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు
- తొలుత పోస్టల్ బ్యాలెట్‌ఓట్ల లెక్కింపు
- అసెంబ్లీ బరిలో 110 మంది
- పార్లమెంటు బరిలో 14 మంది
- అరగంటకో రౌండ్
- తొలి ఫలితం కమలాపురం
- చివరి ఫలితం జమ్మలమడుగు

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల చివరిఘట్టానికి చేరుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఒక ఎత్తయితే కడపలో జరిగిన ఎన్నికలు దేశంలోనే హై ఓల్టేజీగా మారాయి. ఎందుకంటే కడప సీఎం జగన్ సొంత జిల్లా. 2004 నుంచి ఉమ్మడి కడప జిల్లా వైఎస్ కుటుంబాన్ని ఆదరిస్తూ వచ్చింది. 2004, 2009 ఎన్నికల్లో వైఎస్ సీఎం కావడానికి కడప జిల్లా ఆశీస్సులున్నాయి. ఇక జగన్ కాంగ్రెస్‌ను వీడి 2011లో సొంత పార్టీ పెట్టిన తరువాత కడప పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో ఆయన రికార్డు స్థాయిలో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 9 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు జగన్‌కు కట్టబెట్టారు. 2019లో పది అసెంబ్లీ, రెండుపార్లమెంటు స్థానాల్లోనూ జగన్‌కే జై అన్నారు. అయితే ఈ సారి ఎన్నికల్లో మాత్రం కడప జిల్లా ఫలితాలకోసం తెలుగురాష్ట్రాలే కాదు.. ఢిల్లీ నుంచి కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జగన్ మరోసారి సొంత జిల్లాలో క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తుండగా చంద్రబాబునాయుడు కూడా 2004కు ముందు నాటి వైభవం కోసం ప్రయత్నించారు. ఇక సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర పగ్గాలు చేపట్టి కడప పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. దీంతో ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా కడప ఎన్నికలపై ఎనలేని హైప్ క్రియేట్ అయింది. సొంత జిల్లాలో సత్తా చాటేందుకు జగన్ అహర్నిశలు కృషి చేయగా.. పూర్వవైభవం కోసం చంద్రబాబునాయుడు ప్రచారం చేశారు. ఇక పుట్టిన సొంత గడ్డలో రాజకీయ భవితవ్యం తేల్చుకునేందుకు వైఎస్ షర్మిల హోరాహోరీగా ప్రచారం చేశారు. దీంతో ఇక్కడ టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ మధ్య పోరు అందరిలో ఆసక్తి పెంచింది. ఎవరు గెలుస్తారు, ఎన్నిసీట్లు వస్తాయన్న దానిపై రకరకాల అంచనాలు వేసుకున్నారు. అయితే తుది ఫలితం నేడు రానుంది. దీంతో స్టేట్ ఫలితాలు పక్కన బెడితే జిల్లా ఫలితాలపై యావత్ తెలుగు రాష్ట్రాలే కాదు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ ఇతరపార్టీల అగ్రనేతలంతా కడప వైపు చూస్తున్నారు.

8గంటలకు కౌంటింగ్ ప్రారంభం

కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8గంటలకే మొదలు కానుంది. తొలుత పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. 8.30 నుంచి ఈవీయంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. తొలుత ప్రభుత్వ ఉద్యోగుల రూపంలో ఆయా పార్టీల జాతకం బయటపడనుంది. ఆ తరువాత ఓటింగ్‌తో అభ్యర్థుల జాతకాలు తేటతెల్లం కానున్నాయి. కౌంటింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోపే బరిలో దిగిన అభ్యర్థుల జాతకాలు ఖరారు కానున్నాయి. మధ్యాహ్నం తరువాత పందెంకోళ్లు ఎవరో తేలనుంది. జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు అసెంబ్లీ స్థానాలకు 110 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, కడప పార్లమెంటుకు 14 మంది పోటీ చేశారు. అత్యధికంగా సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల నుంచి 27 మంది పోటీలో ఉండగా కమలాపురం నుంచి 11 మంది పోటీ చేస్తున్నారు. కౌంటింగ్ ప్రారంభం అయిన తరువాత తొలి ఫలితం కమలాపురం నియోజకవర్గానిది వెలువడనుంది. చివరి ఫలితం జమ్మలమడుగు కానుంది. మధ్యాహ్నం 3గంటల్లోపే ఫలితాలన్నీ వెలువడనున్నాయి.

సర్వం సిద్ధం

ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడించారు. కడప పార్లమెంటు పరిధిలో అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు ఉంటారన్నారు. మొత్తం 911 మంది కౌంటింగ్‌లో పాల్గొంటారన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఊరేగింపులు, బాణసంచాలు నిషేధం. కౌంటింగ్ రోజున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిని ఎన్నికల రోజు జరిగిన కేసుల్లో నిందితులుగా చేరుస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఇక కౌంటింగ్ కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా పూర్తి నిఘా ఉంటుంది. ఉదయం 7గంటల్లోపే ఏజెంట్లు, లేదా అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. ఆ తరువాత వస్తే అనుమతించరు.

అంతా ఉత్కంఠ

జిల్లాలో మొత్తం 16,39,066 ఓట్లు ఉన్నాయి. ఇందులో 13,04,256 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే 79.57శాతం మంది ఓట్లు వేశారు. అయితే ఈ ఓట్లు మావి అంటే కాదు మావే నంటూ టీడీపీ, వైసీపీ నేతలు ధీమాగా ఉన్నారు. సీఎం జగన్ సొంత జిల్లాలో మాదే గెలుపు అంటూ వైసీపీ చెబుతోంది. అయితే ఈసారి అంత సీన్ లేదంటూ టీడీపీ చెప్పుకొస్తోంది. ఇక వివిధ ఎగ్జిట్‌పోల్స్‌లో జాతీయ, ప్రాంతీయ సర్వే సంస్థల్లో మెజార్టీ శాతం టీడీపీదే అధికారమంటూ అంచనా వేశాయి. కొన్ని సర్వే సంస్థలు మళ్లీ వైసీపీదే అధికారమంటూ చెప్పుకొచ్చాయి. ఉమ్మడి కడప జిల్లాలో మళ్లీ జగన్‌దే హవా అంటూ కొన్ని సంస్థలు ప్రకటించగా.. కేకే సర్వే మాత్రం పులివెందుల, బద్వేలు, రాయచోటి మాత్రమే వైసీపీ గెలుస్తుందని మిగతా ఏడు స్థానాలు టీడీపీ, బీజేపీ, జనసేన గెలుస్తాయంటూ ప్రకటించడంతో వైసీపీకి మైండ్‌బ్లాక్ అయింది. కేకే సర్వేను వైసీపీ శ్రేణులు ట్రోల్ చేశారు. 2019 ఎన్నికల్లో ఇతను సర్వే చేయలేదని చెప్పుకొచ్చారు. అయితే 2019 ఫలితాలకు సంబంధించి కేకే సర్వే అధినేత చెప్పిన సమాచారం యూట్యూబ్‌లో హల్‌చల్ చేసింది. దీంతో వైసీపీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. ఇక సీఎం సొంత జిల్లాలోనే కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాజంపేటలో టీడీపీ గెలుస్తుందని, జమ్మలమడుగులో బీజేపీ, రైల్వేకోడూరులో జనసేన గెలుస్తాయని కేకే సర్వే అంచనా వేసింది. ఇప్పటిదాకా కాకి లెక్కలతో కాలం గడిపిన అభ్యర్థులు, కేడరు అసలు ఫలితం నేడు రానుండడంతో టెన్షన్‌గా గడుపుతున్నారు. మరికొద్ది గంటల్లో గెలిచేదెవరో తేలనుంది. అప్పటి వరకు అభ్యర్థులకే కాదు... ఓటేసిన జనాలకు ఉత్కంఠ తప్పదు.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనవి	శాతం	అభ్యర్థులు	రౌండ్లు
కమలాపురం	2,04,169	1,72,401	84.44	11	18
మైదుకూరు	2,11,855	1,79,692	84.82	15	20
ప్రొద్దుటూరు	247,966	1,97,149	79.59	15	20
బద్వేలు	2,19,290	1,72,660	78.74	14	20
కడప	2,83,543	1,85,079	65.27	13	20
పులివెందుల	2,29,687	1,86,834	81.34	27	22
జమ్మలమడుగు	2,42,556	2,10,141	85.68	15	23
మొత్తం	16,39,066	13,04,256	79.57	110	



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకుంటున్న సిబ్బంది



కౌంటింగ్ కేంద్రం వద్ద పుట్టా



కృష్ణ చైతన్య రెడ్డి

కౌంటింగ్ సజావుగా సాగేలా చూడాలి

- కలెక్టర్ విజయరామరాజు

కడప(రూరల్), జూన్ 3: ఓటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించిన స్ఫూర్తితో కౌంటింగ్‌ను కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులకు హాజరయ్యే సూక్ష్మ పరిశీలకులకు సోమవారం జడ్పీ సమావేశ హాలులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్క్, భానుదాస్ పాలవే హాజరయ్యారు. వీరితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు. కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, నింపవలసిన ఫార్మెట్ల గురించి అవగాహన కల్పించారు. ఏవైనా ఇబ్బందులు, సమస్యలుంటే వెంటనే ఆర్వో దృష్టికి తీసుకొని రావాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు, ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లను రౌండ్‌ల వారీగా లెక్కించే విధానాన్ని, వీవీ ప్యాడ్‌లోని ఓట్లను లెక్కించే ప్రక్రియను సూక్ష్మపరిశీలకులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది అందరూ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. మీకు కేటాయించిన టేబుల్‌లో ఉండి అప్పగించిన బాధ్యతను సజావుగా సాగించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నోడల్ అధికారులు విజయ్‌కుమార్, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్
- విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదు
- ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్3: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సోమవారం కడప నగరంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఎన్నికల కౌంటింగ్, శాంతిభద్రతలపై ఎస్పీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 500 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగంచెల్లో సెక్యూరిటీ ఏర్పాటు చేశామని, ఈ విషయంపై పొలిటికల్ పార్టీలకు బ్రీఫింగ్ చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఏం చేయాలి, ఏం చేయకూడదన్న దానిపై కూడా అవగాహన కల్పించామన్నారు. చిన్న ఇబ్బంది జరిగినా బలంగా ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే చాలామందిపై ప్రివెంటివ్ యాక్షన్ తీసుకున్నామని, 126 మందిని హౌస్ అరెస్టు చేశామన్నారు. 200 నుంచి 300 వరకు పోలీసుస్టేషన్ డిటెన్షన్‌లో పెట్టామన్నారు. పోలింగ్ రోజున జరిగిన అల్లర్లకు కారకులైన 44 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ స్ట్రిక్ట్‌గా అమలు చేస్తున్నామని ఎక్కడా గుంపులుగా ఉండకూడదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి పోలీసు ఎస్కార్ట్‌తో తిరిగి ఇంటికి పోవాలని చెప్పారు. అల్లర్లకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలని అధికారులకు సూచించామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమకు సహకరించాలన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

కడప (క్రైం), జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసు అధికారులకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం స్థానిక మౌంట్‌ఫోర్ట్ స్కూలులో దిశ నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్టీ)లు సిద్ధంగా ఉంటాయని, ఏదైనా ఘటన గురించి సమాచారం వచ్చిన వెంటనే క్షణాల్లో అక్కడకు చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు రాజు, రిమ్స్ సీఐ రామచంద్ర, పోలీసు అధికారులు పాల్గొన్నారు. కాగా సోమవారం రాత్రి 10గంటల సమయంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ పరిశీలించారు. భద్రతను కట్టుదిట్టంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.




కౌంటింగ్ నేపథ్యంలో బందోబస్తుపై పోలీసు అధికారులకు దిశ నిర్దేశనం చేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్

బెట్టింగ్ జోరు

- పందెం లక్షకు లక్షా 80వేలు
- టీడీపీ అధికారం చేపడితే రూ.లక్ష
- వైసీపీ అయితే రూ.1.80లక్షలు



పోరుమామిళ్ల, జూన్ 3: రాష్ట్ర వ్యాప్తంగా నేడు వెల్లడి కానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై పోరుమామిళ్ల సర్కిల్‌లో పందేల జోరు ఊపందుకుంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, భీమవరం ప్రాంతాల నుంచి కొందరు మధ్యవర్తులు పందాలు కాయడానికి సిద్ధమయ్యారు. నిన్న మొన్నటి వరకు లక్షకు లక్ష 50వేలు ఇస్తామని టీడీపీ వారు పందాలు కాశారు. అయినా పందాలకు వైసీపీ వారు ముందుకు రాలేదు. అయితే చివరి రోజు మాత్రం మా పార్టీ గెలిస్తే లక్షకు లక్ష ఇవ్వండి, మీ పార్టీ గెలిస్తే మేం లక్షకు లక్షా 80వేలు ఇస్తాం అంటూ పందాలకు దిగడంతో ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పందాలు జోరుగా సాగాయని సమాచారం. ఆది, సోమవారాల్లోనే పోరుమామిళ్లలో దాదాపు రూ.4 కోట్ల వరకు పందాలు కాశారంటే ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. సోమవారం కూడా చాలా మంది మధ్యవర్తులు రోడ్లపైనే పందాలకు సవాల్ విసరడం చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లు వేసిన అంచనాలకు, చేసిన ఊహలకు నేటితో చెక్‌పడనుంది. అసలు ఫలితాలు మధ్యాహ్నం 3గంటలకంతా తెలిసిపోనున్నాయి. దీంతో బెట్టింగ్ కాసిన వారిలో ఎంత మంది ఊరిలో ఉంటారో, ఎంత మంది ఊరు విడిచి వెళతారో, ఎంత మంది అప్పులపాలవుతారో, ఎవరు ఎవరి డబ్బులు సొంతం చేసుకుంటారో అని చర్చలు సాగుతున్నాయి.



టమోటా @ రూ.50

మదనపల్లె టౌన్, జూన్ 3: మదనపల్లె టమోటా మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో రూ.50 ధరకు చేరుకుంది. ఈ ఏడాది సీజన్‌లో ఇదే గరిష్ఠ ధరగా నమోదైంది. మదనపల్లె మార్కెట్‌కు రెండు నెలలుగా టమోటా విక్రయానికి వస్తున్నా సోమవారం పలికిన ధరలే గరిష్ఠంగా ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో మార్కెట్‌కు నిత్యం 300 నుంచి 400 టన్నులు మాత్రమే టమోటా విక్రయానికి రాగా అప్పట్లో టమోటా గరిష్ఠ ధర కిలో రూ.18 నుంచి కిలో రూ.44 వరకు పలికింది. కనిష్ఠంగా కిలో రూ.7 నుంచి రూ.24 వరకు ధరలు పలికాయి. కాగా గత వారం రోజులుగా మార్కెట్‌కు నిత్యం 600 నుంచి 750 మెట్రిక్ టన్నుల టమోటాలు విక్రయానికి వస్తుండగా ధరలు ఏమాత్రం తగ్గకుండా కిలో రూ.35 నుంచి పెరుగుతూనే ఉన్నాయి. ఈ సందర్భంగా సోమవారం మార్కెట్‌కు 623 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా మొదటిరకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.40 పలుకగా గరిష్ఠంగా రూ.50 పలికింది. రెండోరకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.30 పలుకగా గరిష్ఠంగా కిలో రూ.39 పలికింది. మొత్తం మీద ఈ ఏడాది టమోటా రైతులు లాభాలు చవిచూసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు.



కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



కౌంటింగ్ నిర్వహణపై మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 3: సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సన్నద్ధతపై ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌తో కలసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కడప పార్లమెంటరీ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి జిల్లాలో జనాభా 22,47,356 మంది ఉండగా పురుషులు 11,11359 మంది, స్త్రీలు 11,35,997 మంది ఉన్నారన్నారు. వీరిలో మొత్తం ఓటర్లు 16,39,066 మంది కాగా.. ఇందులో పురుషులు 8,00,857 మంది, స్త్రీలు 8,37,993 మంది, థర్డ్‌జండర్ 216 మంది ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో 79.58 శాతం పోలింగ్ నమోదైందని అత్యధికంగా జమ్మలమడుగులో 86.68 శాతం, అత్యల్పంగా కడపలో 65.27 శాతం నమోదు అయ్యాయన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 92.82 శాతం నమోదు కాగా అత్యధికంగా మైదుకూరులో 96.77 శాతం, అత్యల్పంగా బద్వేలులో 85.86 శాతం నమోదయిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22,645 ఓట్లు, పార్లమెంట్ నియోజకవర్గంలో 22,635 ఓట్లు వినియోగించుకున్నారన్నారు. ఇక సర్వీసు ఓటర్లు 2,283 మంది ఓటు వేశారని ఇందులో అసెంబ్లీ స్థానాలకు 854, పార్లమెంట్‌కు 699 ఓట్లు పోలయ్యాయన్నారు.

సిబ్బంది నియామకం

ఎన్నికల నిర్వహణలో భాగంగా 308 మంది మైక్రో అబ్జర్వర్లను, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ఏఆర్వోలతో సహా కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామన్నారు. మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఒక రోజు శిక్షణ నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు రెండు విడతలు ర్యాండమైజేషన్ పూర్తయిందని, 3వ ర్యాండ మైజేషన్ మంగళవారం ఉదయం నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు, ఈవీఎం కౌంటింగ్ ఉదయం 8-30 గంటలకు ప్రారంభం అవుతాయన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం 7 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమన్నారు. కౌంటింగ్ హాలులోకి ప్రవేశించిన ఏజెంట్లు పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీల్లేదన్నారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్దకు పోటీ చేసే అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్‌ను ఒకేసారి అనుమతించరని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన టేబుళ్ల వద్దే ఉండాలన్నారు. ఈసీఐ పరిశీలకులు కేంద్రాల వద్దనే ఉంటారని తెలిపారు.

నిబంధనలు.. నిషేధాలు

ఈసీఐ అనుమతించిన సిబ్బందికి మినహా కౌంటింగ్ హాలులో మొబైల్ ఫోన్లు నిషేధమన్నారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు తమ గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ధరించాలన్నారు. కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు ఏజెంట్లు తప్పనిసరిగా అపాయింట్మెంట్ లెటర్ రెండోకాపీని ఇవ్వాలన్నారు. మీడియా సెంటర్, పబ్లికేషన్ కమ్యూనికేషన్ రూమ్‌ను కౌంటింగ్ సెంటర్ ప్రాంగణంలోనే ఏర్పాటు చేశామన్నారు. అనుమతిపొందిన మీడియా వారికి మాత్రమే మొబైల్ ఫోన్లను అనుమతిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా ఫలితాల కాపీలను కౌంటింగ్ ఏజెంట్లకు, మీడియావారికి అందిస్తామని తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్లను లెక్కించేందుకు 14 టేబుల్స్ ఉంటాయని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 2 టేబుళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. కడప, ప్రొద్దుటూరు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు మూడు టేబుళ్లు ఉంటాయన్నారు. జమ్మలమడుగుకు అత్యధికంగా 23, అత్యల్పంగా కమలాపురం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రత్యేక హాలులో 4 రౌండ్లలో జరుగుతుందని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు మధ్యాహ్నం 3 గంటలకు, పార్లమెంట్ ఫలితాలు దాదాపు సాయంత్రం 4 గంటలకు వెలువడవచ్చన్నారు. రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు కౌంటింగ్ హాలులో సీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, మూడంచెల భద్రత నడుమ ఓట్ల లెక్కింపు సాగుతుందని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించితే ఉపక్షించేది లేదని హెచ్చరించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

లాభాలు గడిస్తున్న రైతులు



మామిడితోటలో పనస చెట్లను సాగు చేసిన దృశ్యం



మామిడి తోటలో బొప్పాయి సాగు

రాజంపేట, జూన్ 3 : అన్నదాతలు ఇటీవల ఎక్కువగా అంతర్ పంటల వైపు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఉద్యానవన భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగు చేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవనాల్లో ఎక్కువ ఆదాయం లేకపోవడంతో రైతులు అంతర్ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మామిడి, నిమ్మలాంటి ఉద్యానవన పంటల్లో నూగు, సజ్జ, పసుపు, అరటి, ఆకుతోటలు, బొప్పాయి పంటలను పండిస్తున్నారు. దీని వల్ల రెండు రకాల ఆదాయం రైతులకు లభిస్తోంది. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని రాజంపేట, చిట్వేలి, రైల్వేకోడూరు, పెనగలూరు, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, సుండుపల్లె, వీరబల్లి తదితర ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో అంతర్ పంటల సాగు ఎక్కువైంది. మామూలుగా మామిడి నాటిన తరువాత 5 సంవత్సరాల తరువాతనే చెట్లు పెద్దవై.. కాయలు కాస్తాయి. అప్పటి వరకు ఆ తోటల్లో రైతులకు ఎటువంటి ఆదాయం ఉండదు. మామిడి నుంచి పూర్తి స్థాయి ఆదాయం రావాలంటే కనీసం చెట్లకు 8 సంవత్సరాలు వయసు నిండాల్సి ఉంది. అప్పటి వరకు సరైన పంట అందదు. ఈ సమయంలో అక్కడ రైతుకు ఎటువంటి ఆదాయం ఉండదు. ఏడాది పొడవునా ఎకరాకు కనీసం 10 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఆ చెట్లను పెంచుకోవడానికి దున్నకాల ఖర్చులు, ఎరువుల ఖర్చులు, మందుల పిచికారీ ఖర్చులు ఇతరత్రా అనేక ఖర్చులు తడిసిమోపెడవుతాయి. అయితే ఒక్క పైసా ఆదాయం ఉండదు. 8 సంవత్సరాలు వచ్చే వరకు చెట్ల నుంచి పూర్తి స్థాయి పంట రాదు. అంత వరకు ఆదాయం లేనందున రైతులు ఆ పొలాల్లో పసుపు, నూగు, బొప్పాయి, ఆకుతోట, అరటి, పూలతోటలు తదితర పంటలను విరివిగా సాగు చేస్తున్నారు. దీనివల్ల రైతులకు పెట్టిన ఖర్చులు పోనూ ఎకరాకు 30 వేల రూపాయల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు. దీనివల్ల రైతులకు కొంత మేలు జరుగుతోంది. రాజంపేట డివిజన్‌లో సుమారు 5 వేల ఎకరాల్లో అంతర్ పంటల సాగు జరుగుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.



మామిడిలో అంతర్‌పంటగా నువ్వుల సాగు



మామిడి, జామ, పనస, దానిమ్మ చెట్ల సాగు

అన్నకు తోడుగా ఈతకు వెళ్లి నీటికుంటలో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహాన్ని వెలికితీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది, మృతి చెందిన బాలుడు భీమా

బద్వేలు టౌన్, జూన్ 3: అన్నకు తోడుగా సరదాగా ఈతకు వెళ్లిన తమ్ముడు ముళ్లపాటి భీమా(10) ప్రమాదవశాత్తు నీటికుంటలో జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బంధువుల వివరాల మేరకు... బద్వేలు పట్టణంలోని సాయినగర్‌కు చెందిన శ్రీనివాసులు, నాగ లక్షుమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు సంతానం. శ్రీనివాసులు ఉపాధి నిమిత్తం తెలంగాణా రాష్ట్రంలో బెల్దారిపనికి వెళ్లాడు. తల్లి మేకలు కాచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ తరుణంలో ఇద్దరు కుమారులు శేషాద్రి, భీమా పట్టణంలోని నూతన ఆర్డీఓ కార్యాలయం భవన నిర్మాణం వెనుకవైపు ఉన్న నీటి కుంటలోకి సరదాగా ఈతకు వెళ్లారు. అన్నకు తోడుగా వెళ్లిన తమ్ముడు భీమాకు ఈతరాని కారణంగా గట్టుపై ఉండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడ్డాడు. దీంతో అన్న శేషాద్రి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు గమనించి అక్కడకు చేరుకున్నారు. అయితే బాలుడి ఆచూకీ లభించక పోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది పోలీసులు అక్కడకు చేరుకుని నీటికుంటలో బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి శవాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు



కిడ్నాపర్లను చూపుతున్న పోలీసులు

మైదుకూరు, జూన్ 3: మండలంలోని జీవి సత్రంకు చెందిన అవిరేని సంతోష్ అనే వ్యక్తిని ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు వాహనంలో వచ్చి కిడ్నాప్ చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ఈ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే... కిడ్నాప్ చేసిన వ్యక్తులు సంతోష్ అన్న శివకు ఫోన్ చేసి మీ తమ్ముడు వీసా పంపిస్తానంటూ మోసం చేసి రూ.3లక్షలు తీసుకున్నాడని, వెంటనే డబ్బులు ఇస్తే వదిలి పెడతామంటూ తెలిపారు. దీంతో సంతోష్ తండ్రి శ్రీనివాసులు మైదు కూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాలతో సీఐ మస్తాన్, ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి, దువ్వూరు ఎస్ఐ శ్రీనివా సులు కిడ్నాపర్ల కోసం గాలింపు చేపట్టారు. ఈనేపథ్యంలో దువ్వూరు బైపాస్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దుర్గారెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు 8 మందిని అదుపులోకి తీసుకుని విచారించి.. కిడ్నాపర్ల బారి నుంచి సంతోష్‌ను విడిపించారు. కాగా కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన పోలీసులను ఎస్పీ సిద్ధార్థ కౌశిల్ అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు

- హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్
- సీఐ, ఎస్ఐలకు చార్జి మెమోలు

కడప (క్రైం), జూన్ 3: పెద్దముడియం పరిధిలో నిర్లక్ష్యం వహించిన పోలీసు సిబ్బందిపై వేటు వేస్తూ ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తుంది. హౌస్ అరెస్టులో ఉన్న ఇరువురిని వదిలి వేయడంతో వారు బయట యథేచ్ఛగా తిరుగుతున్నట్లు తెలియడంతో హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే ఎస్ఐ రామక్రిష్ణ, జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డిలకు చార్జి మెమోలు, జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

మద్యంషాపులు సీజ్



మద్యంషాపులోను సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప (క్రైం), జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం షాపులు బార్లు, రెస్టారెంట్లను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు తమ సిబ్బందితో మద్యంషాపులను సీజ్ చేసి... షాపుల వద్ద బార్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం 5వ తేదీ మద్యం దుకాణాల్లో విక్రయాలు యదావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

బాలికకు తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, జూన్ 3: నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లికి చెందిన శ్రీనివాసులు కుమార్తె జి.వైష్ణవి(13) ఇంటి వద్ద ఆడుకుంటూ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టేవైరు తాకడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. గమనించిన కుంటీకులు వెంటనే బాలికను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్త వేధింపులతోనే వేదవతి ఆత్మహత్య

- మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ
- దస్తగిరికి దేహశుద్ధి చేసిన మహిళలు
- భీమగానిపల్లెలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



వేదవతి అంత్యక్రియల్లో గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పుంగనూరు, జూన్ 3: భర్త దస్తగిరి వేధింపులతోనే తమ బిడ్డ వేదవతి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ వేదవతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాయచోటి ఏరియా ఆస్పత్రి నుంచి ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు గంగాధర్, రాఘవమ్మ, పోలీసులు పుంగనూరు మండలం భీమగానిపల్లెకి సోమవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. మృతురాలి భర్త దస్తగిరి కూడా రావడంతో గ్రామంలోని మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా తమ బిడ్డను పొట్టనపెట్టుకుని పసిబిడ్డను అనాథను చేశావంటూ దేహశుద్ధి చేశారు. వేదవతి కుమార్తె షహీనా(5)ను అంత్యక్రియలకు తీసుకురాకుండా మదనపల్లెలోని దస్తగిరి అమ్మవద్ద విడిచి రావడంపై ఆగ్రహించారు. తమకు బిడ్డను అప్పగించే వరకు అంత్యక్రియలు చేయబోమని భీష్మించారు.

భర్త కొట్టడం, హింసించడం వల్లే తమ బిడ్డ చనిపోయిందని, వేదవతి ఉద్యోగం భర్తకు ఇవ్వొద్దని, పసిబిడ్డను తమకు అప్పగించాలని రాయచోటి నుంచి వచ్చిన ఏఆర్ డీఎస్పీ, పోలీసులను కోరారు. వివాహం చేసుకునేటప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని, ఇప్పుడు మాట్లాడితే ప్రయోజనం ఏమిటని, ముందే జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పోలీసులు సర్దిచెప్పారు. మదనపల్లెనుంచి షహీనాను పోలీసులు తీసుకొచ్చారు. గంగాధర్ ఇంటి వద్ద పోలీసులు వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. 'కూలిపనులు చేసి వేదవతిని చదివించాం. పుంగనూరులో 9 నెలలు కోచింగ్‌కు పంపితే ముందే పెళ్లి చేసుకుని బిడ్డలున్న వ్యక్తి మాటలకు మోసపోయి జీవితం నాశనం చేసుకుంది. చాలా మంచోడని వెళ్లింది. అతడికి ముందే పెళ్లయిన విషయం తెలిసి సంవత్సరం తర్వాత ఫోన్ చేసింది ఏడ్చింది. భార్య జీతం, లోన్లు తింటూ నరకం చూపించాడు. మూడునెలల క్రితం ఫోన్‌చేసి నన్ను కొడుతున్నాడని, చాలా ఇబ్బందిపడుతున్నానని, నేను వచ్చేస్తానని చెబితే వచ్చేయమన్నాం. పెళ్లి కావాల్సిన సోదరికి ఇబ్బందని ఆలోచించి పుట్టింటికి రాకుండా ఇబ్బంది పడింది. గతంలో ఒకసారి మావద్దకు వచ్చినందుకు దస్తగిరి గొడవ చేశాడు. రాయచోటిలో వేదవతి శవాన్ని కూడా ఇవ్వమని చెప్పారు. మేము ఒక్క రూపాయి జీతం కూడా తినలేదు. బిడ్డకు టెంకాయ కొట్టుకునేందుకు తీసుకెళతామని పట్టుబడితే ఇచ్చారు' అంటూ తల్లి రాఘవమ్మ రోదించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం వద్ద రాయచోటి పోలీసులు మరోసారి వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి, గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. కాగా, వేదవతి భర్త దస్తగిరికి గ్రామస్తులు దేహశుద్ధి చేయడంతో అతడు అంత్యక్రియల్లో పాల్గొనకుండా వెళ్లిపోయాడు.

ట్రాక్టర్ బోల్తా... వ్యక్తి మృతి



ఆంజనేయులు(ఫైల్‌ఫొటో)

కొండాపురం, జూన్ 3: మండలంలోని వెంకయ్యకాలువ వద్ద ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఆంజనేయులు(43) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు యల్లనూరులో కట్టెల లోడు అన్‌లోడ్ చేసి ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ వస్తుండగా వెంకయ్య కాలువ సమీపంలోకి రాగానే ఎదురుగా బొలెరో వాహనం వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆంజనేయులు ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

కల్వర్టును ఢీ కొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన అన్నమయ్య

పుల్లంపేట, జూన్ 3: మండల పరిధిలోని పుత్తనవారిపల్లె మలుపు వద్ద కడప-చెన్నై రహదారిలో సోమవారం సాయంత్రం బైకుపై వస్తున్న యువకుడు కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. కోడూరు మండలం అనంతరాజుపేట అరుంధతీవాడకు చెందిన అన్నమయ్య (25) నెల క్రితం కువైట్ నుంచి వచ్చాడు. సోమవారం రాజంపేట నుంచి తిరిగి ఇంటికి బయలు దేరాడు. తన గ్రామానికి చెందిన పరశరామున్ని ఎక్కించుకుని పల్సర్ బైక్‌పై వస్తూ పుత్తనవారిపల్లెకు రాగానే బైక్ అదుపు తప్పి కల్వర్టు పైకి ఎక్కించాడు. దీంతో పరశురాముడు పక్కకు పడిపోగా అన్నమయ్య రాతిపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజంపేటకు తరలించినట్లు పుల్లంపేట పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని వారు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, జూన్3: బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ అనే వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తన ఇంటికి గత రెండురోజులుగా విద్యుత్ సరఫరా కాలేదని స్వయంగా విద్యుత్ పని చేస్తుండగా షాక్‌కు గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు శివశంకర్‌ను ప్రైవేటు వాహనంలో మదనపల్లెకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

23 దుంగలు స్వాధీనం ముగ్గురు నిందితుల అరెస్టు

వాల్మీకిపురం, జూన్ 3: అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాల్మీకిపురం పోలీసులు సోమవారం దాడులు చేసి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు..వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామానికి చెందిన అన్నదమ్ములు పట్నం లక్ష్మణాచారి(35), పట్నం శ్రీరాములుఆచారి (30), తిరుపతి జిల్లా ముత్యాలరెడ్డిపల్లెకు చెందిన పి.పవన్ కుమార్(34)లు ముగ్గురు కలిసి దుంగలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. సుండుపల్లె సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను ఏపీ05 బీహెచ్2727 కారులో తరలిస్తూ మరో కేఏ03ఎంహెచ్1769 కారును పైలెట్ వాహనంగా పెట్టుకుని సోమవారం వేకువజా మున మండలంలోని చింతపర్తి-నిమ్మనపల్లె రోడ్డుగుండా బెంగ ళూరు ప్రాంతానికి రవాణా చేస్తుండగా తనతోపాటు ఎస్ఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది వాహనాలను వెంబడించి దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ దాడులలో 23 ఎర్రచందనం దుంగలు, రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. వాహనాల సహా మొత్తం రూ.32 లక్షల విలువైన ఎర్ర చందనం పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితు లను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు. కాగా పట్నం లక్ష్మణాచారి, పవన్ కుమార్‌లు ఇరువురు గతకొద్దినెలల క్రితం కుప్పంలో ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడడం గమనా ర్హం. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్న సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభి నందించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె అర్బన్, జూన్3: స్థానిక బెంగళూరు రోడ్డు సమీపం లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడే రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి తాలుకా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన సంఘటన మరువక ముందే ఇలా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించడం విశేషం. ఈ సందర్భంగా సెబ్ సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో, వంకల్లో, వాగుల్లో, గుట్టల్లో అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత కడప



విజేతగా నిలిచిన కడప జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు కొనసాగాయి. అనంతపురం, కడప జట్ల మధ్య మ్యాచ్ జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 24 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 23.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించింది. దీంతో కడప మూడు వికెట్ల తేడాతో గెలిచింది. గురు విగ్నేష్ 90 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో... చిత్తూరు, కర్నూలు జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు 26 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 26 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన 88 పరుగులు సాధించిన లక్ష్మీనారాయణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. పాయింట్ల ఆధారంగా కడప జట్టును టోర్నీ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

కడప జట్టుపై కర్నూలు, నెల్లూరుపై అనంతపురం జట్ల విజయం



సాయి సూర్యతేజ (72 పరుగులు), సెంచరీ చేసిన గిరినాథ్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్) జూన్ 3 : కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం కడప జట్టుపై కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించగా, మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై అనంతపురం జట్టు ఒక్క వికెట్ తేడాతో విజయకేతనం ఎగురవేసింది. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సోమవారం కడప-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 43.3 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి కేవలం 136 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది. ఇందులో వంశీకృష్ణ 36 పరుగులు సాధించగా, మిగతా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. తదుపరి విజయమే ధ్యేయంగా బరిలోకి దిగిన కర్నూలు జట్టు 27.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 138 పరుగులు చేసింది. ఇందులో సాయి సూర్యతేజ 72 పరుగులు చేసి విజయంలో కీలకంగా నిలిచారు. దీంతో కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అలాగే కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యి 195 పరుగులు చేసింది. ఇందులో మాధవ్ 70 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 33.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 196 పరుగులు సాధించి విజయపతాకాన్ని ఎగుర వేసింది. ఇందులో గిరినాథ్‌రెడ్డి 100 పరుగులు (77బంతులు) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

చెస్‌లో సత్తా చాటిన కడప చిన్నారి



తృతీయ బహుమతి అందుకుంటున్న అమీనా

కడప (స్పోర్ట్స్) జూన్ 3 : గుంటూరులో ఈనెల 2వ తేదీ ఆదివారం నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన చిన్నారి అమీనా అండర్-9 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించింది. ఏడు రౌండ్లకు గాను మూడు పాయింట్లు సాధిం చి ఆ ఘనత సాధించింది. దీంతో ఏపీ చెస్ అసో సియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సుమన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంది.

వైభవంగా నల్లవీరగంగాభవానీ ఊంజల్‌సేవ

వాల్మీకిపురం, జూన్ 3: వాల్మీకిపురం పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన నల్లవీరగంగాభవానీ అమ్మవారి ఆల యంలో ఊంజల్‌సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహిం చారు. సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణలు గావించి భక్తజనం నడుమ ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రమణా రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, అర్చకులు జనార్ధనస్వామి, సభ్యులు ఆనందశెట్టి, బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

'శంకర్‌బాలాజీని సస్పెండ్ చేయాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 3: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీని ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతాశ్రమంలో గోశాల లేకపోయినా పశుగ్రాసం పేరుతో లక్షల రూపాయలు నిధులు డ్రా చేశారని, అలాగే విద్యార్థులకోసం రూ.18.50 లక్షలతో నాశిరకంగా మరుగుదొడ్లు నిర్మించారని అవి శిథిలావస్థకు చేరడంతో రిపేర్లకోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. రూ.5 లక్షలు కూడా ఖర్చు కానీ రోడ్డుకోసం రూ.25 లక్షలు వెచ్చించి రోడ్డు వేశారని పేర్కొన్నారు. శివాలయం రూములకు సంబంధించి మామూళ్లు ఇచ్చినవారికి కేవలం అయిదుశాతం బాడుగ పెంచి ప్రభుత్వానికి నష్టం చేకూర్చుతున్నారని తెలిపారు. మిట్టాపాపయ్య సత్రం అవినీతిలో శంకర్‌బాలాజీ ప్రధాన సూత్రదారి అని పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠంలో కారు వాడుకుంటూ కడప-ప్రొద్దుటూరులో బిల్లులు డ్రా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆయన అవినీతిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంటు అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీని సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బద్వేలు పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠం సంబంధించిన దేవాలయాల వివాదాలలో ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆయనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష, పుల్లయ్య, రామ్మోహన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే సమాజం పురోగతి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 3: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే సమాజం పురోగమిస్తుందని జేవీవీ మాజీ కార్యదర్శి మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని, చదువులో భాగంగా ఆటలు ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను అవసరం అయినంతవరకే ఉపయోగించాలని సరైన రీతిలో వాడుకోకపోతే మన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, జంక్‌ఫుడ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, రాజశేఖర్, రాజేష్, తేజ, హాసిని, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

సగిలేటికి నీరు రాక



కలసపాడు, జూన్ 3 : కలసపాడు మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సగిలేటికి నీరు రావడం మొదలైంది. చెన్ను పల్లె, ఎగువ రామా పురం పరిసర ప్రాంతాల్లో వర్షం బాగా కురి సింది. దీంతో నీరు రావడం మొదలైంది. కొన్ని నెలలు గా సగిలేటిలో నీరు పారక పోవడంతోభూగర్భ జలా లు అడుగ ంటాయి. నీరు రావడంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

కలసపాడు, జూన్ 3 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కట్టకిందిపల్లె నుండి కలసపాడు వరకు పలు గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమతెరలు వినియోగించాలి

ఖాజీపేట, జూన్ 3: ప్రతి ఒక్కరూ దోమల నుంచి రక్షణ కవచంలా దోమతెరలు వినియోగించాలని మండల వైద్యాధికారి ముబీన్ అన్నారు. సోమవారం స్థానిక రావులపల్లె సచివాలయం పరిధిలోని పాటిమీదపల్లె గ్రామంలో సోమవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, విజయభాస్కర్, సుజాత, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువగా.. కేసీ కెనాల్



చెన్నూరు వద్ద కేసీ ఉప కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు



కేసీ ఉప కాల్వలో విరిగి పడిన కంపచెట్లు

చెన్నూరు, జూన్ 3 : వందలాది ఎకరాలకు నీరందించే కేసీ ఉప కాల్వ చెన్నూరు మురుగుతో నిండి దుర్గంధభరితంగా మారింది. ఇటీవల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కాల్వకు ఓ వైపు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా, ప్రజలు అందులో వ్యర్థాలు వేయడం మాత్రం మానలేదు. అధికారులు సైతం గతంలో ఉన్న వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు కాల్వకు ఇరువైపులా గట్లపై పలు రకాల పిచ్చిమొక్కలు మొలవడంతో ఆ వ్యర్థాలు కుళ్లిపోయి కాల్వ అంతా దుర్గంధభరితంగా మారింది. ప్రతి ఏడాది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్‌ను శుభ్రం చేసేవారు. ఈసారి మాత్రం ఫెన్సింగ్ ఉండడంతో కాల్వను శుభ్రపరచలేదు. చిన్నపాటి ఎక్సకవేటరును కాల్వలోకి దించి శుభ్రపరిచే ఆస్కారం ఉన్నా దానిపై దృష్టి సారించలేదు. ఇటీవల ఓ పెద్ద తుమ్మ చెట్టు గాలికి విరిగి కాల్వలో అడ్డంగా పడింది. కాల్వకు కింది వైపు అరుంధతీనగర్ ప్రాంతంలో కాల్వలో పూడిక తీసి పక్కనే పడేశారు. కొత్తగాంధీనగర్, లక్ష్మీనగర్, శ్రీరాంనగర్ ఉన్న చోట మాత్రం ఏ మాత్రం శుభ్రం చేయలేదు. పైగా ఎవరైనా అడిగితే ఇది శుభ్రం చేయడానికి వీలు లేకుండా ఉంది, ఈ మురుగులోకి మేం దిగం అన్నట్లుగా సమాధానం వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉపాధి హామీ పథకంలో కాల్వను శుభ్రం చేయించాలనుకున్నా అందులో కాలు పెట్టేందుకు ఉపాధి కూలీలు సైతం నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాల్వకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమించవద్దు

- అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీసుయాక్టు అమలు
- కట్టుదిట్టంగా తనిఖీలు

పులివెందుల టౌన్, జూన్ 3: మంగళవారం కౌంటింగ్ సందర్భంగా పులివెందుల పట్టణంలో పూర్తిస్థాయిలో కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నామని పట్టణ సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో అన్ని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దాబాలు మూసివేయాలన్నారు. ఆర్టీసీ బస్సులకు కూడా పట్టణంలోకి రాకుండా రింగురోడ్డులోనే ప్రయాణం చేస్తాయన్నారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు తమ ప్రయాణాలను, వైద్య సదుపాయాల నిమిత్తం తప్ప రోడ్లపైకి, వీధుల్లోకి రాకూడదన్నారు. ఎలాంటి ఊరేగింపులకు గాని, సభలకు, ధర్నాలకు, విజయోత్సవ సభలకు, ర్యాలీలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చడానికి వీల్లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ఆఫీసుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని, నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆఫీసుల వద్దకు రాకూడదన్నారు. అన్ని రూట్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఆధార్ కార్డును తనిఖీ చేస్తారన్నారు. శాంతి భద్రతల విషయంలో సహకరించాలని ప్రజలను, నాయకులను కోరారు.

వీరపునాయునిపల్లె: ఎన్నికల కోడ్, సెక్షన్ 144(2), సెక్షన్ 30 పోలీస్ యాక్టులు అమలులో ఉండడంతో నలుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడరాదంటూ పోలీసులు దండోరా వేయించారు. జూన్ 6వ తేదీ వరకు ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా నిషేధమన్నారు. పార్టీ కార్యాలయాల వద్ద, ఫంక్షన్ హాల్స్, సెంటర్ల వద్ద, ఎల్‌ఈడీ స్ర్కీన్స్ ఏర్పాటుచేసి జన సమీకరణ చేయడం నిషేధమన్నారు. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే పోస్టులను పెట్టరాదన్నారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

వల్లూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్, 30 యాక్టు అమల్లో ఉంటుందని వల్లూరు సబ్ ఇన్‌స్పెక్టరు కత్తి వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ 4న మంగళవారం రోజంతా కర్ఫ్యూ ఉంటుందన్నారు. ప్రజలంతా ఎవరి ఇంట్లో వారు ఉండాలన్నారు. బయటికి రాకూడదన్నారు. ఎవరైనా మెడికల్ ఎమర్జన్సీ తప్ప రోడ్లపైన అనవసరంగా తిరగరాదన్నారు. అంగళ్లు, వస్త్ర దుకాణాలు, కూరగాయలు, కూల్‌డ్రింక్స్ తదితర దుకాణాలన్నీ మూసి వేయాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పాస్‌పోర్టు కూడా రద్దు చేస్తామన్నారు. కావున ప్రతి ఒక్కరూ పోలీసుల ఆదేశాలను పాటించాలన్నారు.

నియమాలు పాటిస్తే.. ప్రయాణం ప్రమాద రహితం



కడప: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, సైన్స్‌క్లబ్ అధ్యక్షుడు తదితరులు

పులివెందుల పూలంగళ్ల సర్కిల్ వద్ద తనిఖీలు చేపట్టిన సీఐ శంకర్‌రెడ్డి



కడప (మారుతీనగర్) జూన్ 3: రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రయాణాలను ప్రమాదరహితం చేసుకోవాలని సర్ సి.వి.రామన్ సైన్స్ క్లబ్ (కడప) డివిజన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం స్థానిక కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రోడ్డు భద్రత అందరి బాధ్యత అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్స్ బాబ్జీ, సురేష్, సుబ్రమణ్యం, జేమ్స్, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, సిబ్బంది శ్రీనివాసాచారి, సుబ్బమ్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ఉక్కుపాదం

పులివెందుల రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై జూన్ నుంచి మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిని, బైకులు నడిపిన మైనర్లను స్టేషన్‌కు తరలిస్తున్నారు. పులివెందుల పట్టణంలో ప్రధాన కూడళ్లు, రింగురోడ్డు కూడళ్లలో వాహన తనిఖీలు చేస్తున్నార. కౌన్సిలింగ్ ఇవ్వడం, జరిమానాలు విధించడం వంటివి కఠినంగా అమలుచేస్తున్నారు.

కమలాపురంలో కుక్కలు, పందుల హల్‌చల్!





మురుగునీటిలో సంచరిస్తున్న పందులు, వీధిలో తిరుగుతున్న కుక్కలు

కమలాపురం రూరల్, జూన్ 3 : పట్టణంలో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తుండడంతో కమలాపురం పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మధ్యకాలంలో కుక్కల దాడులు పెరిగిపోతున్నా, ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. కుక్కలు పిల్లలపైనే కాకుండా పెద్దలపైన కూడా తిరగబడి దాడి చేసే పరిస్థితి వస్తోంది. దీంతో చిన్నపిల్లలు రోడ్డు మీదకు రావాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది. కుక్కలు నాలుగైదు కలిసి వీధుల్లో ఒక జట్టుగా సంచరిస్తున్నాయి. వేసవి సెలవుల్లో ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లలపైకి వస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. తినుబండారాలు చేతిలో పట్టుకుని వెళుతున్న పిల్లల వెంట పడి కుక్కలు దాడి చేస్తున్నాయి.

కోతుల సం చారం కూడా ఎక్కువైపోతోంది. చేతిలో ఏదైనా బరువుగా ప్లాస్టిక్ కవరు కనిపించినా వెంటనే దాడి చేసి, గాయపరిచి లాక్కుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను నగర పంచాయతీ నుంచి దూరంగా తరలించడంతోపాటు, కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

గిరిజనుల భూములకు ఆన్‌లైన్ చేయించాలి



గిరిజనుల భూముల వద్ద మాట్లాడుతున్న రాజశేఖర్

రైల్వేకోడూరు, జూన్ 3: సమతానగర్ గిరిజనుల భూములకు ఆన్‌లైన్ చేయించాలని రైల్వేకోడూరు సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని కె.బుడుగుంటపల్లె గ్రామ పంచాయితీలో ఉన్న సమతానగర్ గిరిజనులకు చెందిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992లో భూములు చూపించి, పట్టాలు ఇచ్చారని, అయితే ఆన్‌లైన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 120 ఎకరాల భూమిని 60 కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిందని, 1992లో సర్వే చేయించి భూములను చూపించారన్నారు. అయితే వాటిని ఇంత వరకు ఆన్‌లైన్ కూడా చేయలేదన్నారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, సమతానగర్ గిరిజనులు నరిగిపాటి సుబ్బమ్మ, నగిరిపాటి గంగమ్మ, ప్రొద్దుటూరు అంకమ్మ, ఉయ్యాల సుబ్బమ్మ, మేకల బత్తయ్య, పాలెంకోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ అహ్మద్‌కు సేవారత్న పురస్కారం

సుండుపల్లె, జూన్ 3: మండలానికి చెందిన సంఘ సేవకుడు సయ్యద్ అహ్మద్ సేవారత్న పురస్కారం అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో మాతృదేవోభవ అనాథాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టుగిరి.. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపర్చిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా అహ్మద్‌కు ఉమ్మడి ఏపీ మాజీ హోంమంత్రి, ప్రస్తుత తెరాస మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

ముగిసిన దండుమారెమ్మ తిరుణాల



ప్రత్యేక అలంకరణలో దండుమారమ్మ

సుండుపల్లె, జూన్ 3: మండలంలోని భాగం పల్లె గ్రామ పంచాయతీ కుంటల ముందరలో వెలిసిన దండుమారెమ్మ తిరుణాల సందర్భంగా ఆదివారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. సోమవారం గ్రామస్తులు బోనాలు సమర్పించి అన్నదాన కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల నుండి అమ్మవారికి భక్తులు అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు భక్తులకు దర్శనం ఇచ్చాయి. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి చాందినీ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

'హం దో.. హమారే బారా చిత్రాన్ని నిషేధించాలి'



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సలావుద్దీన్ .

కడప (మారుతీనగర్) జూన్ 3: పవిత్ర ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన హం దో- హమారే బారా అనే హిందీ చిత్రాన్ని వెంటనే నిషేధించాలని పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, నజీర్‌అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ అలీఖాన్, జేఏసీ జిల్లా కన్వీనర్ బాబుబాయ్, మత గురువులు జాకీర్‌హుస్సేన్, అబ్దుల్ రెహమాన్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 7న విడుదల కానున్న ఆ సినిమాలో ఇస్లాం సంప్రదాయం, సంస్కృతి, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ సినిమా నిర్మించడం సరైందికాదన్నారు. దీంతో ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆ సినిమా ట్రైలర్ రిలీజైందని, అందులో పవిత్ర ఖురాన్‌లోని సూరా బకరాను వక్రీకరిస్తూ సన్నివేశాలున్నాయన్నారు. భారతీయ సినిమాటోగ్రఫీ చట్టం కింద ఆ సినిమాను నిషేధించాల ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డెమో రమణమ్మ

సింహాద్రిపురం, జూన్ 3: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని డిప్యూటీ డెమో రమణమ్మ తెలిపారు. మండలంలోని కోవరంగుటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష, డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ గర్భిణులు స్కాన్ చేయించుకునేటప్పుడు బిడ్డ ఆడా, మగా అని అడుగరాదన్నారు. అలా అడిగినట్లయితే అడిగినవారికి, చెప్పిన స్కాన్ సెంటర్ వారికి శిక్ష పడుతుందన్నారు. హెల్త్ రికార్డులలో నమోదైన గర్భిణులు ఏ స్కాన్ సెంటర్‌కు వెళుతున్నారు. వారిలో ఎవరైనా అబార్షన్ చేయించుకునే ప్రయత్నంలో ఉన్నారా అనే విషయాలను గమనించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సాధ్యమైనంతవరకూ లింగ నిర్ధారణలో ఆడబిడ్డ అని తెలియగానే అబార్షన్‌కు ప్రయత్నిస్తారు. అలాంటి సమయంలో మన హెల్త్ సిబ్బంది వారి ప్రయత్నం ఆపేలా వివరించాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న స్కాన్ సెంటర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు, అలాంటి సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఖాదర్‌బాషా, సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, హెల్త్ ఎడ్యుకేటర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి నమోదు చేసుకోండి

కడప (మారుతీనగర్) జూన్ 3: కడపలోని ప్రధాన మంత్రి కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కోశాధికారి జితేంద్ర తెలిపారు. నగర సింగపూర్ టౌన్‌షిప్ పక్కనే ఉన్న కేంద్రీయ విద్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సీబీఎస్ఈ, స్టేట్‌బోర్డు, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్ సిలబస్‌లో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీషు మాధ్యమంలో సైన్స్, మాథ్స్, గ్రూపులు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. కేవీఎస్ఏఎన్‌జీఏటీఏఎన్, ఎన్ఐసీఐఎన్ అనే వెబ్‌సైట్ చూడాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాతలు

కమలాపురం రూరల్, జూన్ 3: నగర పంచాయతీ పరిధిలోని బాలబాలికలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని పాస్టర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ తెలిపారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని షాలేం మందిరంలో పెనుబాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం అన్నారు. చాలా మంది పేద విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక చదువుకోలేక ఇళ్లవద్ద ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అలాంటి విద్యార్థులకు చదువుకున్న ప్రోత్సహిస్తూ విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సందాస్ హనీ వారి ఆర్థికసాయంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, క్లిప్ అట్టలు బాక్సులు కలిపి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఇంకా దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.

పార్టీ కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు



పోలీసుల బందోబస్తు మధ్య పులివెందుల టీడీపీ కార్యాలయం

పులివెందుల రూరల్, జూన్ 3: పులివెందులలోని వైసీపీ, టీడీపీ కార్యాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఒక్కో కార్యాలయం వద్ద ఆరు నుంచి పది మంది దాకా సిబ్బందిని నియమిస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సందర్భంగా పార్టీ కార్యాలయాల వద్దకు కార్యకర్తలు, నాయకులు ఎవరు రాకూడదని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. రెండు పార్టీలలో ఏదొక పార్టీ గెలుపొందే సందర్భంలో కవ్వింపు చర్యలకు పాల్పడడం, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంలాంటివి జరగకుండా ఈ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసు శాఖ తెలిపింది. స్పెషల్ పార్టీ పోలీసు బలగాలను అన్ని ప్రధాన కూడళ్లలో, గ్రామీణ ప్రాంతాలలో పోలీసులు కలియతిరగనున్నారు. మంగళవారం ఫలితాలు వెలువడనుండడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పోలీసు శాఖ తెలిపింది.

దోబీఘాట్ నిర్మించాలి

వీరపునాయునిపల్లె, జూన్ 3: మండల కేంద్రంలో దోబీఘాట్‌ను నిర్మించాలని రజకులు కోరుతున్నారు. గ్రామంలో 30 నుంచి 40 కుటుంబాల రజకులు ఉన్నా దోబీఘాట్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయం పలుమార్లు ప్రభుత్వ దృష్టికి, తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప దోబీఘాట్‌ను నిర్మించిన పాపాన పోలేదని వాపోతున్నారు. అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని పరిస్థితిలో ఉన్నారని ఆరోపిస్తున్నారు.


అన్నమాచార్య అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



మురళీమోహన్ నాయక్

సికెదిన్నె, జూన్ 3: తమ కళాశాల అధ్యాపకుడు మురళీమోహన్‌నాయక్‌కు అనంతపురం జేఎన్‌టీయూ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు అన్నమాచార్య కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్.మూర్తి పర్యవేక్షణలో ఫర్‌ఫార్మెంట్స్ అగుమెంటేషన్ ఆఫ్ కంబైన్డ్ సైకిల్ పవర్‌ప్లాంట్ విత్ ఇన్‌లెట్ ఎయిర్‌కూలింగ్ వేపర్ అబ్జక్షన్ రిఫ్రిజిరేషన్ సిస్టం అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ లభించిన మురళీమోహన్‌నాయక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డితోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఏవో రామసుబ్బారెడ్డి అభినందించారు.

గుంతల రోడ్లతో ప్రజల ఇబ్బందులు



ఇప్పెంట రోడ్డులో గుంతలో నుంచి వెళుతున్న ఆటో

సికెదిన్నె, జూన్ 3: గుంతలమయమైన రోడ్లతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీలోని బోడెద్దులపల్లె, ఇప్పెంట, వెంకట్రాంపల్లె, కాంపల్లె, పవర్‌గ్రిడ్ వరకు దాదాపు 7 కి.మీ. రోడ్డు గుంతలమయమైంది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు అధికంగా ప్రయాణిస్తుంటాయి. ఈ గోతుల కారణంగా ఆయా వాహనాలు పలుసార్లు ప్రమాదాల బారిన పడ్డాయి. దీనికి తోడు వృద్ధులు, మహిళలు ఈ మార్గంలో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల కౌంటింగ్ బందోబస్తును పరిశీలించిన ఎస్పీ



ప్రొద్దుటూరు క్రైం, జూన్ 3 : నేడు జరుగనున్న ఎన్నికల కౌంటింగ్ బందోబస్తును ఎస్పీ సిద్దార్థ కౌశల్ పరిశీలించారు. సోమవారం పట్టణానికి వచ్చిన ఆయన పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్య కూడళ్లలోని బందోబస్తును పరిశీలించారు. కొత్తపల్లి జంక్షన్, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్, విజయకుమార్ సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ వద్ద బందోబస్తును పరిశీలించారు. ఆయన డీఎస్పీ మురళీధర్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, టుటౌన్ సీఐ అబ్దుల్ కరీం, త్రీటౌన్ సీఐ వెంకటరమణ, రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

కౌంటింగ్ బందోబస్తుపై సమీక్షించిన ఎస్పీ

మైదుకూరు, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవరోధాలు లేకుండా బందోబస్త్ ఏర్పాట్లపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సమీక్షించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల సీఐ, ఎస్ఐలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లల్లో వాహన తనిఖీలు చేపట్టాలని, 144 సెక్షన్ అమలులో ఉందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేసులు, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

మైలవరం, జూన్ 3 : ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మైలవరం, తలమంచిపట్నం ఎస్ఐలు రెడ్డిసురేష్, హనుమంతు తెలిపారు. సోమవారం ఎస్ఐలు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులు అమలులో ఉన్నా యని ఈ ఉత్తర్వులు ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది ప్రజలు గుమి గూడరాదన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు.

హ్యాట్రిక్కా.. సానుభూతా..?

● 14 టేబుళ్లు... 20 రౌండ్లు ● కొద్ది గంటల్లోనే తేలనున్న మైదుకూరు నియోజకవర్గ అభ్యర్థుల భవితవ్యం





రఘురామిరెడ్డి

పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జూన్ 3 : గత 22 రోజులుగా ఎదురుచూస్తున్న నేతల భవితవ్యం మరి కొన్ని గంటల్లోనే తేలనుంది. గత నెల 13న ఓటింగ్ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 1,79,785 మంది ఓటర్లు సానుభూతికి పట్టం కట్టారా లేదా హ్యాట్రిక్ విజయం వైపు ఓట్లేశారా అన్న అంశం తేటతెల్లమవుతుంది. గత 22 రోజులుగా నిరీక్షణలో ఉన్న ఓటర్ల తీర్పు వెలువడనుంది. మైదుకూరు నియోజకవర్గంలో 2,11,855 మంది ఓటర్లుండగా 1,79,785 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,547 మంది ఓట్లు వేశారు. కాగా మంగళవారం కడపలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. 269 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 14 టేబుళ్లపై 20 రౌండ్లల్లో ఓట్లును లెక్కిస్తారు.

రౌండ్ల వారీగా వివరాలు...: మొదటగా దువ్వూరు మండలం బయనపల్లెతో రౌండ్ 1లో 1 నుంచి 14 కేంద్రాలలో బయనపల్లె, పెద్ద జొన్నారం పరిధిలో గల గ్రామాలు, 2వ రౌండ్‌లో 15 నుంచి 28లో గల దువ్వూరు, 3వ రౌండ్‌లో 29-42 మదిరేపల్లె, గుడిపాడు 4వ రౌండ్‌లో 43-56 గుడిపాడు, తిప్పిరెడ్డిపల్లె గ్రామాలు, 5వ రౌండ్ మైదుకూరు మండలంలోని 57 నుంచి 70 పోలింగ్ బూత్‌లల్లోని ప్రకాశ్‌నగర్, విశ్వనాధపురం మధ్యలోని గ్రామాలు, 6వ రౌండ్‌లో 71 నుంచి 84 పరిధిలోని విశ్వనాధపురం, మైదుకూరు సాయినాధపురం, 7వ రౌండ్‌లో మైదుకూరు పట్టణంలోని 85 నుంచి 98 కేంద్రాలు, 8వ రౌండ్‌లో మైదుకూరు, శెట్టివారిపల్లెలోని 99-112 కేంద్రాలు, 9వ రౌండ్‌లో 113 -126 చిన్నయ్యగారిపల్లె, జాండ్లవరం, 10వ రౌండ్‌లో జాండ్లవరం నుంచి వరదాయపల్లెలోని 127-140 వరకు, 11వ రౌండ్‌లో చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె నాగులపల్లె పరిధిలోని 141-154 కేంద్రాలు, 12వ రౌండ్‌లో చియ్యపాడు-చిన్నగులువలూరు పరిధిలోని 155-168 కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 13వ రౌండ్‌లో పెద్దగులువలూరు ఖాజీపేట మండలంలోని తుడుమలదిన్నె పరిధిలోగల 169- 182 కేంద్రాలు, 14వ రౌండ్‌లో తిమ్మారెడ్డిపల్లె ఖాజీపేట టౌన్‌లోని 183-196కేంద్రాలు, 15వ రౌండ్‌లో రావులపల్లె పరిధిలోని 197-210 కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 16వ రౌండ్‌లో సుంకేసుల, పుల్లూరు పరిధిలోని 198-224మ కేంద్రాలు, 17వ రౌండ్‌లో బి మఠం మండలంలోని కందిమల్లాయపల్లె (బి మఠం)225 - 238 కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 18వ రౌండ్‌లో లింగలదిన్నెపరిధిలోని 239-252 కేంద్రాలు, 19వ రౌండ్‌లో ముడుమాల, పెద్దిరాజులపల్లె పరిధిలోని 253-266 కేంద్రాలు, చివరగా 20వ రౌండ్‌లో బి మఠం మండలంలోని బోదపాడు పరిధిలోని 267-269 కేంద్రాలు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆర్వో చంద్రమోహన్ తెలిపారు. కాగా ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మూడవ సారి పోటీ చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపా లేక వరుసగా రెండు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి మూడోసారీ హ్యాట్రిక్ సాధించేందుకు పోటీ చేసిన శెట్టిపల్లె రఘురామిరెడ్డి గెలుపా అనేది మరి కొన్ని గంటల్లో తేలనుంది.



వ్యాపార సంస్థలను మూయించిన పోలీసులు

మైదుకూరు, జూన్ 3 : మైదుకూరు పట్టణంలో సోమవారం రాత్రి 7 గంటల నుంచే పోలీసులు వ్యాపార సంస్థలను మూయించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సీఐ ఏపీ మస్తాన్ తమ సిబ్బందితో కలసి పట్టణంలోని ప్రధాన రహదారులపై కలియ తిరుగుతూ వ్యాపార సంస్థలు సోమవారం రాత్రి 7 గంటల నుంచి మంగళవారం రాత్రి 10 గంటల వరకు మూసి ఉంచాలని తెలిపారు.

పోలీసు బందోబస్తు

ఖాజీపేట, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని ఖాజీపేటను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రామాంజులు మూడు రోజుల నుంచి గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. రాత్రివేళ 11 గంటల వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలని పోలీసులు సూచించారు ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు.

అట్లూరు..: ఓట్ల లెక్కింపులో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టపాసులు కాల్చకుండా విజయోత్సవ ర్యాలీలు జరుపుకోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా సోమవారం గ్రామాల్లో పోలీసు బందోబస్తు నిర్వహించడం జరిగిందని అట్లూరు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. మండలంలోని ఎర్రబల్లి నుంచి కమలకూరు వరకు అట్లూరు మండల పరిధిలోని పంచాయతీ గ్రామాల్లో గ్రామానికి ఇద్దరు చొప్పున పోలీసు సిబ్బందిబందోబస్తు ఉన్నారన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల, జూన్ 3 : ఎన్నికల ఫలితాల సందర్భంగా కవ్వింపుచర్యలకు పాల్పడినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఎవరైనా ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రధాన రహదారుల గుండా లాంగ్‌మార్చ్ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద సిబ్బందికి దిశ నిర్దేశనాలు ఇచ్చి విధి విధానాలు తెలిపారు. మంగళవారం ఎమర్జన్సీ అయిన మెడికల్, మిల్క్‌దుకాణాలు తప్ప ఏ దుకాణాలు తెరవరాదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ట్రబుల్ మాంగర్స్ వారి నివాసగృహాల వద్ద ఉండి టీవీల ద్వారా ఫలితాలు వీక్షించాలే కానీ వీధుల్లోకి వచ్చి బాణసంచా పేల్చడం, కేకలు వేయడంవంటి సంఘటనలకు పాల్పడితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలి

ఖాజీపేట, జూన్ 3: ప్రతి ఒక్కరూ దోమల నుంచి రక్షణ కవచంలా దోమతెరలు వినియోగించాలని మండల వైద్యాధికారి ముబీన్ అన్నారు. సోమవారం స్థానిక రావులపల్లె సచివాలయం పరిధిలోని పాటిమీదపల్లె గ్రామంలో సోమవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, విజయభాస్కర్, సుజాత, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో బద్వేలు

● హామీలు బుట్టదాఖలు...అభివృద్ధి మాయమాటలు

బద్వేలు, జూన్ 3: కాలజ్ఞాన కర్త బ్రహ్మంగారుచెప్పినట్లు బద్వేలు బస్తీ అవుతుందన్న మాట తరచూ వినిపిస్తూ ఉంటుంది. బస్తీ మాట ఏమోగానీ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఎక్కడ చూసినా అసౌకర్యాలు, మౌలిక సదుపాయాలు , అస్తవ్యస్తంగా డ్రైనేజీలు ఉన్నాయి. సౌకర్యాలు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు విఫలం చెందారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బద్వేలు మున్సిపాలిటీగా పేరు మారినా అభివృద్ధి మాత్రం ఆమడదూరంలో ఉంది.



సిమెంటు రోడ్డుకు నోచుకోని రెడ్డెయ్య మఠం వీధి

బద్వేలు పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ నుంచి ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌లు, వైసీపీ నేతలు ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి. అభివృద్ధి మాయమాటలను తలపిస్తోందన్న విమర్శలు వినవస్తున్నాయి. బద్వేలు అభివృద్ధి వైసీపీ పాలనలో ప్రజలు ఆశించినంతగా జరగకపోడంతో ప్రజలు మున్సిపాలిటీ పాలకవర్గాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

హామీలు గాలికి..: బద్వేలు పట్టణ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, పాలకులు అనేక హామీలు ఇచ్చారు. బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.120కోట్లు కేటాయించినప్పటికీ వైసీపీ నేతల అనుకూల వార్డులలో కొద్దో గొప్పో రోడ్లు వేశారే తప్ప మిగతా పనులను గాలికొదిలేశారు.డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. బద్వేలు డ్రైనేజీ చూస్తే పట్టణం ఇలా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతాయి. రోజురోజుకు బద్వేలు పట్టణం విస్తరిస్తుండడంతో అందుకు తగ్గట్లుగా అభివృద్ధి పనులు చేపట్టలేకపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలలో అనేక హామీలు గుప్పించి గద్దెనెక్కిన వైసీపీ పాలకులు అభివృద్ధి మాటే మరిచారు. బద్వేలులో ఓ మోస్తరు వర్షం కురిసినా నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక వీధులు బురదమయమైపట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతారు. డ్రైనేజీ వ్యవస్థను బాగుపరుస్తామని చెప్పిన వైసీపీ ప్రజాప్రతినిధుల హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. కాసేపు సేదతీరి ఆహ్లాదకరంగా గడిపేందుకు పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పిన నేతలు నేటికీ పార్కు ఏర్పాటు చేయలేదు. కూరగాయల మార్కెట్, శ్మశానాల అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు చేస్తామని ప్రజలకు ఎన్నో మాయమాటలు చెప్పి గద్దెనెక్కాక వైసీపీ ప్రజాప్రతినిధులు హామీలను గాలికొదిలేయడంతో పట్టణ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.



ఆర్టీసీ బస్టాండు వెనుక వైపు అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

సగిలేటికి నీరు రాక



కలసపాడు, జూన్ 3 : కలసపాడు మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సగిలేటికి నీరు రావడం మొద లైంది. చెన్ను పల్లె, ఎగువ రామా పురం పరిసర ప్రాంతాల్లో వర్షం బాగా కురి సింది. దీంతో నీరు రావడం మొదలైంది. కొన్ని నెలలు గా సగిలేటిలో నీరు పారక పోవడంతోభూగర్భ జలా లు అడుగ ంటాయి. నీరు రావడంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

కలసపాడు, జూన్ 3 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కట్టకిందిపల్లె నుండి కలసపాడు వరకు పలు గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షంతో నీటి కుంటలను తలపించిన రోడ్లు





పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు సమీపంలో నీటికుంటలను తలపిస్తున్న ప్రధాన రహదారి, అంబేద్కర్ సర్కిల్‌లో నీటి కుంటలను తలపిస్తున్న రహదారి

పోరుమామిళ్ల,జూన్3 : పోరుమామిళ్లలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమై నీటి కుంటలను తలపించాయి. తెల్లవారుజామున దాదాపు గంటకు పైగా కురిసిన వర్షానికి ప్రధాన రహదారులే కాకుండా పురవీధుల్లో కూడా వర్షం నీరు చేరి నీటిగుంటలను తలపించాయి. ముఖ్యంగా అంబేడ్కర్ సర్కిల్‌లో వర్షం నీరు చేరి నీటి కుంటల్లా మారింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఎక్కువగా గుంతలు ఉండడంతో అందులో వర్షం నీరు చేరడంతో గుంతలోతు గమనించని వాహనదారులు అందులో పడి పోతున్నారు. సాయిబాబా దేవాలయం వద్ద ఇరువైపులా కాల్వలు పూడిపోవడంతో నీరు వెళ్లే దారి లేకపోవడంతో ఆ రోడ్డంతా నీటి కుంటగా మారింది. సాయంత్రం వరకు ఆ నీరు అలాగే ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. కొత్తవీధి, ఓల్డ్ పోస్టాఫీసువీధి, దిగువ ప్రాంతాల్లో వర్షం నీరు ఎక్కువగా చేరి నిల్వ ఉండి ఇబ్బందిగా మారింది.

కొండాపురం..: మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున వర్షం కురిసింది.ఋతుపవనాలు ప్రారంభం కావడంతో మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది.గత కొన్ని నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ వర్షం ఊరటనిచ్చిందని చెప్పవచ్చు.ఈ ఏడాది ఋతుపవనాలు ముందే ప్రారంభం కావడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు దుక్కి దున్నేందుకు సన్నద్దమవుతున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చు

బద్వేలు రూరల్, జూన్ 3 : వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతతో వ్యాధులు నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తెలిపారు. తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలాయపల్లె సచివాలయం హరిజనవాడలో సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు జ్యోత్స్న, ఏఎంఎస్ రమాదేవి, దీపిక, ఆశా కార్యకర్త లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

'శంకర్‌బాలాజీని సస్పెండ్ చేయాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 3: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీని ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతాశ్రమంలో గోశాల లేకపోయినా పశుగ్రాసం పేరుతో లక్షల రూపాయలు నిధులు డ్రా చేశారని, అలాగే విద్యార్థులకోసం రూ.18.50 లక్షలతో నాశిరకంగా మరుగుదొడ్లు నిర్మించారని అవి శిథిలావస్థకు చేరడంతో రిపేర్లకోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. రూ.5 లక్షలు కూడా ఖర్చు కానీ రోడ్డుకోసం రూ.25 లక్షలు వెచ్చించి రోడ్డు వేశారని పేర్కొన్నారు. శివాలయం రూములకు సంబంధించి మామూళ్లు ఇచ్చినవారికి కేవలం అయిదుశాతం బాడుగ పెంచి ప్రభుత్వానికి నష్టం చేకూర్చుతున్నారని తెలిపారు. మిట్టాపాపయ్య సత్రం అవినీతిలో శంకర్‌బాలాజీ ప్రధాన సూత్రదారి అని పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠంలో కారు వాడుకుంటూ కడప-ప్రొద్దుటూరులో బిల్లులు డ్రా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆయన అవినీతిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంటు అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీని సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బద్వేలు పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠం సంబంధించిన దేవాలయాల వివాదాలలో ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆయనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష, పుల్లయ్య, రామ్మోహన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే సమాజం పురోగతి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 3: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే సమాజం పురోగమిస్తుందని జేవీవీ మాజీ కార్యదర్శి మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని, చదువులో భాగంగా ఆటలు ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను అవసరం అయినంతవరకే ఉపయోగించాలని సరైన రీతిలో వాడుకోకపోతే మన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, జంక్‌ఫుడ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, రాజశేఖర్, రాజేష్, తేజ, హసిని, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో పార్కింగ్ స్థలాలు ఎక్కడ..?

రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు

పోరుమామిళ్ల, జూన్ 3 : ఎక్కడైనా ద్విచక్ర వాహనాలు , ఆటోలకు స్టాండ్‌లు ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు. వాహనదారులు, బాటసారులు ప్రధాన రహదారుల వెంట నడవాలన్నా, షాపుల వద్దకు వెళ్లాలన్నా చాలా ఈజీగా ఉంటుంది. కానీ పోరుమామిళ్ల లో బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా రూ.25 కోట్లతో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు నిలిచి పోయాయి. రోడ్డుకిరువైపులా సిమెంటు రోడ్లు వేసి డ్రైనేజీ కాల్వలు నిర్మించి ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తామని చెప్పిన నాయకుల మాటలు నీటిమూటలయ్యాయి. అధికారులు కూడా ఏం చేయలేని పరిస్థితుల్లో ఉండిపోయారు. ఉన్న రహదారిపైనే రోజూ కొన్ని వందల కొద్దీ వాహనాలు తిరుగుతుంటాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పోరుమామిళ్లకు వచ్చే వారు పార్కింగ్ స్థలం లేక రోడ్లపై గంటల తరబడి తమ వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాక ఏపీజీబీ బ్యాంకుకు వెళ్లే దారిలో ఆ బ్యాంకు వచ్చేవారు రోడ్లపైనే వాహనాలు నిలపడంతో ఇబ్బందికరంగా మారింది. అలాగే స్టేట్‌బ్యాంకు సమీపంలో కూడా ద్విచక్ర వాహనాలు క్యూలో ఉంటాయి. చాలాకాలంగా ఈ సమస్య పోరుమామిళ్లను వెంటాడుతున్నా పరిష్కారం లేదు. ఫలితంగా ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. మరికొందరు అయితే రోడ్లపైనే వాహనాలు నిలిపి బాతాఖానీ చేసుకుంటూ పచార్లు కొట్టడం పరిపాటి అయింది. తమ వాహనాలు ఎక్కువసేపు రోడ్లపై ఉంచడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారనే ఆలోచన కూడా ఏ మాత్రం లేకుండాపోయింది. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్ వద్ద నుంచి హుసేన్‌పీర్‌దర్గా వరకు రోడ్డుకిరు వైపులా ప్లాట్‌ఫాం లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అంతేకాక తోపుడుబండ్ల వ్యాపారులు కూడా తమకు స్థలంలేకపోవడంతో ఈ రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుంటారు. స్టేట్‌బ్యాంకు సమీపం లో ఆర్టీసీ బస్టాండు సమీపంలో, దేశాయి థియేటరు సమీపంలో రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు, ఆటోలు కనిపిస్తుంటాయి. వీటికి శాశ్వత పరిష్కారం రావాలంటే రోడ్డు విస్తరణ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి రోడ్డుకి రువైపులా ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసేంత వరకు ఈ సమస్యలు పోరుమామిళ్ల ప్రజలను వెంటాడుతుంటాయి.



ఆంధ్రప్రగతి బ్యాంకు సమీపంలో రోడ్లకిరువైపులా ద్విచక్ర వాహనాలు